క్లుప్తంగా

శాకంబరీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



విజయనగరం టౌన్: నగరంలోని ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు..శాకంబరీదేవిగా భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు ఉమామహేశ్వరశర్మ వేకువజాము నుంచి అమ్మవారికి విశిష్ట అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం కుంకుమార్చనలు నిర్వహించారు. ఆ తర్వాత రకరకాల కూరగాయలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

అలరించిన సంగీత కచేరీ



గీతాలాపన చేస్తున్న శ్రీనిధి

విజయనగరం టౌన్: నగరంలోని ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో శనివారం సాయంత్రం నిర్వహించిన నారాయణ తీర్థుల 350వ జయంతిలో భాగంగా చేపట్టిన సంగీత కచేరీ అలరించింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి గాత్ర కచేరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముకుందమాల స్తోత్రంతో కచేరీ ప్రారంభించి పాహిమాం అనే నారాయణతీర్థ తరంగం, రఘువంశ, తదితరులు గీతాలాపన చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దవళ సర్వేశ్వరరావు, మండపాక రవి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత ఖోఖో సంఘంలో సత్యనారాయణ



విజయనగరం: దక్షిణ భారత ఖోఖో సంఘ కార్యవర్గ సభ్యుడిగా జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు చింతా సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఈ ఎన్నికలో సత్యనారాయణకు ఈ అవకాశం దక్కినట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం.సీతారామరెడ్డి శనివారం తెలిపారు. ప్రస్తుతం సత్యనారాయణ జిల్లా ఖోఖో అసోయేషన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా దక్షిణ భారత ఖోఖో సంఘంలో ఆయనకు చోటు లభించడం పట్ల ఆయనకు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షురాలు పెనుమజ్జి విజయలక్ష్మి, చైర్మన్ పి.చిన్నం నాయుడు తదితరులు అభినందనలు తెలిపారు.

మహిళలు 'వన్‌స్టాప్'ను ఆశ్రయించండి



మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ బ్యూలారాణి

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న మహిళలు రక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలని ఆ సెంటర్ లీగల్ కౌన్సిలర్ కె.బ్యూలారాణి, కేస్ వర్కర్ టి.అనితలు కోరారు. నగరంలోని ఏజీఎల్ కళాశాలలో విద్యార్థులకు వన్‌స్టాప్ సెంటర్ సేవలపై శనివారం అవగాహన కల్పించారు. బాధితులకు సెంటర్ ద్వారా రక్షణ, వైద్యం, న్యాయ సాయం అందించడం జరుగుతుందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాలు



మాట్లాడుతున్న పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుడు ఉమాశంకర్

భోగాపురం: వరల్డ్ జునోటిక్ డే సందర్భంగా స్థానిక ఏరియా పశువైద్య కేంద్రం వద్ద పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ టీకాలు శనివారం వేశారు. మూగజీవాల నుంచి మనుషులకు దాదాపు 36 రకాల వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఇంటి వద్ద పెంచుకునే జంతువులకు టీకాలు వేయించాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుడు ఉమాశంకర్ తెలిపారు. జంతువుల నుంచి సోకే వ్యాధులను జునోసిస్ వ్యాధులుగా పరిగణిస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 300 డోసుల వ్యాక్సిన్లు పెంపుడు కుక్కలకు వేయడం లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు.

సమస్యలపై ఏకరువు!

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాసమస్యలపై సభ్యుల ధ్వజం
- గతంలో ప్రస్తావించిన సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని మండిపాటు
- నిర్లక్ష్య వైఖరి తగదని అధికారులకు హితవు



విద్యుత్ శాఖ సమస్యలపై జేఈని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, ఎంపీపీ అనూషారెడ్డి

పూసపాటిరేగ: భోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు ఏకరువుపెట్టారు. ప్రధానంగా విద్యుత్ సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావడం లేదని, ఈ విషయంలో ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఎంతమాత్రం తగదని పోలిపల్లి, రాజాపులోవ, రావాడ సర్పంచ్‌లు కర్రోతు వెంకటరమణ, కిలారి స్వప్న, అప్పలభుక్త పైడినాయుడు మండిపడ్డారు. విద్యుత్ లోవోల్టేజి సమస్య, ఏబీ స్విచ్‌లు లేకపోవడం, శిథిలమైన విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఇవే సమస్యలను సభలో లేవనెత్తినా ఫలితం శూన్యమన్నారు. దీనిపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎంపీపీ అనూషారెడ్డిలు స్పందించారు. సమావేశానికి జూనియర్ ఇంజినీర్ రావడంతో 10 రోజుల క్రితం సమావేశం ఉన్నట్లు నోటీసు పంపించినా అసిస్టెంట్ ఇంజినీరు రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. మళ్లీ ఇదే పొరపాటు జరిగితే చర్యలకు ఉపక్రమిస్తామన్నారు. విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని, లేకుంటే చర్యలకు ఆదేశిస్తామని ఎంపీపీ తెలిపారు. వ్యక్తిగత సమస్యలతో పోలిపల్లికి చెందిన కో–ఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా సాహెబ్ తెలియజేయడంతో ఎమ్మెల్యే వారించి ఇలాంటి సమస్యలు సభలో కాకుండా వ్యక్తిగతంగా వచ్చి తెలియజేయాలన్నారు. భోగాపురం మోడల్ స్కూల్ విద్యార్థి కొయ్య హరీష్..పదో తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా నిలిచారని ఎంఈవోలు ఎం.రమణమూర్తి, బాలిపల్లి చంద్రమౌళిలు తెలిపారు. ప్రతి పంచాయతీలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఉండేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. అనంతరం ఓపెన్ స్కూల్ గోడపత్రికలను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఎయిర్‌పోర్ట్‌లో తొలగిస్తున్న బైరెడ్డిపాలెం పాఠశాల స్థానంలో నూతన పాఠశాలకు స్థలసేకరణ చేయాలని తహసీల్దారు రమణమ్మను ఆదేశించారు. ఈ నెల 10న జరగబోయే మెగా పేరెంట్ డేకి విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరవ్వాలన్నారు. బొల్లింకలపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించాలని సభలో అడగడంతో ఐసీడీఎస్ పీవోను ప్రశ్నించగా పూర్తిస్థాయిలో సమాచారం తెలుసుకుని చెబుతామన్నారు. ఇదిలా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు గుర్ల మండలం కలిపి మొత్తం రూ.60 కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకిశోర్ తెలిపారు. పచ్చిరొట్ట, వేరుశనగ, చిరుధాన్యాల విత్తనాలు వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి కె.హైమావతి తెలిపారు. అలాగే 176 మంది రైతులకు సీసీఆర్ కార్డులు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం మరికొంతమంది సభ్యులు వారి ప్రాంతాల్లో నెలకొన్న ప్రజాసమస్యలు ప్రస్తావించి, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిశోర్‌కుమార్, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బర్రి చినఅప్పన్న, భోగాపురం ఐసీడీఎస్ పీవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

8న వైఎస్సార్ జయంతి, 13న పార్టీ విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు

విజయనగరం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి(వైఎస్సార్) జయంతి కార్యక్రమం ఈ నెల 8వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్‌లు తెలిపారు. ఇదే విషయమై వారు నగరంలో మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వైఎస్సార్ జయంతి రోజు ఉదయం 10 గంటలకు నగరంలోని సీఎంఆర్ జంక్షన్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు. అలాగే ఈ నెల 13వ తేదీన వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు నగరంలోని రింగురోడ్డులో సుజాత కన్వెన్షన్ హాల్‌లో జరిగే సమావేశానికి పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, కార్పొరేటర్‌లు బండారు ఆనంద్, గాదం మురళి, పట్నాన పైడిరాజు, గుజ్జల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలి



ఫార్మాసిస్టులతో సమావేశమైన ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ శంబంగి అప్పలనాయుడు సూచించారు. ఇదే విషయమై ఆయన ఆస్పత్రిలోని ఫార్మాసిస్టులతో శనివారం సమావేశమై, పలు సూచనలు చేశారు. అంకితభావంతో పనిచేయాలని, వృత్తి పట్ల చిత్తశుద్ధి, నిబద్ధత పాటించాలని, వైద్యులు రాసిచ్చిన చీటీలను క్షుణ్ణంగా చదివి దానికి తగ్గట్టుగా రోగులకు మందులు అందజేయాలని తెలిపారు. మందులు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తగా ఉంటే ఒకరి మందులు మరొకరికి ఇచ్చేసే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



మాజీ మంత్రి కన్నబాబుతో జెడ్పీ చైర్మన్ కుటుంబం, మాజీ ఎంపీ మాధవి

విజయనగరం: వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు.. విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల ఆత్మీయ కలయిక(మర్యాదపూర్వకంగా) శనివారం జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగే పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరయ్యేందుకు విచ్చేసిన కన్నబాబును ధర్మపురిలోని జెడ్పీ చైర్మన్ క్యాంప్ కార్యాలయానికి ఆహ్వానించారు. చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర, ప్రదీప్‌నాయుడులు కన్నబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం జెడ్పీ చైర్మన్, కన్నబాబు కలిసి అల్పాహారం తీసుకుని, కుటుంబాల బాగోగులను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పార్టీ బలోపేతం, ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై చర్చించారు. వారి వెంట అరకు మాజీ పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి, అరుకు పార్లమెంటరీ జిల్లా పరిశీలకులు బొడ్డేటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



విజయనగరం గంటస్తంభం: సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విజయనగరం గంటస్తంభం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక, రైతు, ప్రజా, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్యవేదిక నాయకులు జగన్మోహనరావు, సురేష్, సూర్యనారాయణ, రాంబాబు, రాములు కోరారు. ఇదే విషయమై నగరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన కార్మిక చట్టాలను కాదని, కార్మికలోకానికి అన్యాయం జరిగేలా కేంద్రంలోని మోదీ సర్కారు కొత్తగా లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. కార్మికులను బానిసలుగా మలిచే లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఉద్యోగులకు కనీస వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అప్పలసూరి, అప్పికొండ, మధుసూదనరావు, అప్పారావు, రవికుమార్, రమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

పూసపాటిరేగ: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. మండలంలోని మైలాన్ పరిశ్రమ, ఎస్ఎంఎస్, హెచ్‌బీఎల్ పరిశ్రమల వద్ద ఈ నెల 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను కార్మికులకు శనివారం పంపిణీ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు డిమాండ్ చేస్తూ చేసే ఈ సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని ఆమె కోరారు.

ఆర్థిక, సామాజిక బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: పేదలను ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మార్గదర్శి–బంగారు కుటుంబం అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, అడ్మిన్, వెల్ఫేర్ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా పీ4 సర్వే చేయడం జరిగిందని, ప్రాథమిక సర్వే ఆధారంగా సచివాలయాల పరిధిలోని పేదవారి వివరాలను ప్రభుత్వం జాబితా రూపంలో విడుదల చేసిందన్నారు. ఈ జాబితాలోని పేదలను బంగారు కుటుంబాలుగా మార్చేందుకు ఆయా సచివాలయాల పరిధిలోని ఉన్నత స్థితిలోని వారిని మార్గదర్శకులుగా మ్యాపింగ్ చేసే ప్రక్రియను ప్రారంభించనున్నామన్నారు. ఈ ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

భోగాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని అవంతి కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో రుషినాయుడు, ప్రిన్సిపాల్ పూర్ణ నగరి కోరారు. మండలంలోని చెరుకుపల్లి అవంతి కళాశాలలో శనివారం వనమహోత్సవం నిర్వహించి, విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విజయనగరం క్రైమ్: నగరంలోని తోటపాలెంలో ఉన్న సాహితి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. గంజాయి నిర్మూలనలో భాగంగా ఈగల్(ఎలైట్ యాంటీ నార్కొటిక్స్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) టీమ్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఐజీ రవికృష్ణ ఆదేశాలతో ఈగల్ బృందం జిల్లా వ్యాప్తంగా యువతకు అవగాహన కల్పిస్తున్నారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఈగల్ టీమ్ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి ఎంతోమంది యువత చెడు అలవాట్లకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా గంజాయి రవాణా, విక్రయాలు జరిగినా వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని బృందావన్ వ్యాలీలో నిర్వహిస్తున్న శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. అర్చకులు సంతోష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అర్చనలు, అభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

కమిషనర్‌ను కలిసిన ఏపీఎన్జీవో నాయకులు

విజయనగరం: జిల్లా కేంద్రంలో నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్యను ఏపీఎన్జీవో నాయకులు శనివారం కలిశారు. ఇటీవల కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియలో ఎటువంటి ప్రలోభాలకు తావులేకుండా పూర్తిగా పారదర్శకంగా బదిలీలు నిర్వహించినందుకుగాను కమిషనర్‌కు వారు అభినందనలు తెలిపారు.

తపాలా సేవలు నిలుపుదల

విజయనగరం టౌన్: స్థానిక పోస్టల్ డివిజనల్‌లోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 7వ తేదీన పోస్టల్ కార్యాకలాపాలు నిలిపివేస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. అన్ని పోస్టల్ ఆఫీసుల్లో కొత్త సాఫ్ట్‌వేర్ పునరుద్ధరిస్తున్నందున తపాలా కార్యాకలాపాలకు అంతరాయం ఏర్పడుతోందని, వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

మా గ్రామాన్ని పంచాయతీగా మార్చండి

- సీతంపేట గ్రామస్తుల వినతి



ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న సీతంపేట గ్రామస్తులు

శృంగవరపుకోట: మా గ్రామంలో జనాభా పెరిగింది.. మా అవసరాలకు తగ్గట్టుగా పాలన సాగడం లేదు.. వెంటనే మా గ్రామాన్ని పంచాయతీగా మార్చాలని మండలంలోని సీతంపేట గ్రామస్తులు కోరారు. ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో అధికారులకు సీతంపేట గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ముప్పై వేలకు పైగా జనాభా ఉన్న ఎస్.కోట పంచాయతీలో మా గ్రామం విలీనమై ఉందన్నారు. ఇప్పుడు మా గ్రామంలో కూడా వేల సంఖ్యలో జనాభా ఉన్నారు. కాబట్టి మా గ్రామాన్ని పంచాయతీగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోషికుమారి, వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, సీతంపేట గ్రామస్తులు సన్యాసప్పడు, చిప్పాడ రమణ, వై.ఈశ్వరరావు, చింతల నారాయణమూర్తి, వై.దేముడు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మపల్లిలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం చేస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో మామిడితోటలో నవధాన్యాల సాగు పంటకోత ప్రయోగం శనివారం నిర్వహించారు. గ్రామానికి చెందిన నర్సిపల్లి వెంకటరమణ మామిడి తోటలో నవధాన్యాలు సాగుచేశారు. ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ నేతృత్వంలో పంట కోత ప్రయోగం నిర్వహించి దిగుబడి అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ మొదటివారంలో నవధాన్యాలు వేయడం వల్ల ఖరీఫ్‌లో కూరగాయలు, రాగి పంటలకు మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, ఈశ్వరరావు, మదీనా, సైంటిస్ట్ ధనలక్ష్మి, తదితరుల పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని బృందావన్ వ్యాలీలో నిర్వహిస్తున్న శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. అర్చకులు సంతోష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అర్చనలు, అభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

వైభవంగా మారు రథయాత్ర



రథంపై కొలువుదీరిన బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి

రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా మారు రథయాత్ర విజయనగరం జిల్లా కేంద్రంలో శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. సంతపేట జగన్నాథస్వామి తోమాల మందిరం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్దకు చేరుకుని భక్తులకు దర్శనమిచ్చారు. రథంపై కొలువుదీరిన బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథునికి భక్తులు విశేష పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

–విజయనగరం టౌన్



జగన్నాథుని దర్శనానికి పోటెత్తిన భక్తులు